ప్రతి అక్షరం ప్రజాహితం

RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 349 పేజీలు - 04 వెల - 05/- శనివారం 31 ఆగష్టు 2024

# హరితాంధ్రప్రదేశ్ కోసం అడుగేద్దాం



- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేద్దాం.!
- రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం వస్తే అదే నిజమైన స్వర్ణాంధ్రప్రదేశ్.
- మొక్క లేకపోతే మానవ మనుగడే లేదు...చెట్టు లేకపోతే జీవరాశుల చరిత్రే ఉండదు.
- 175 నియోజకవర్గాల్లో నగర వనాల ఏర్పాటు...నీటి వనరులు, సహజ వనరుల పరిరక్షణ.
- ప్రకృతి ప్రజల ఆస్తి....దాన్ని అందరం కాపాడుకోవాలి.
- ప్రతి ఒక్కరూ ఏడాదికి రెండు మొక్కలు అయినా నాటాలి...చెట్లను పెంచాలి.
- ఎర్రచందనం స్మగ్లర్లకు హెచ్చరిక... అడవిలో కాలు పెడితే సంగతి తేలుస్తాం.
- పచ్చదనం, చల్లదనం కోరుకుంటూ...మొక్కలు పెంచకపోతే ఎలా?
- వన మహోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

2లో



## ఏపీలో ఉద్యోగుల బదిలీల గడువు పొడిగించిన ప్రభుత్వం.!

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 30:
ఉద్యోగుల బదిలీలు చేపట్టేందుకు మరో 15 రోజులపాటు గడువును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సెప్టెంబరు 15 వరకు బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్టు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సెప్టెంబరు 16 నుంచి బదిలీలపై మళ్లీ నిషేధం అమల్లోకి వస్తుందని స్పష్టం చేస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటికీ చాలా ప్రభుత్వశాఖలు బదిలీల విధివిధానాల్ని రూపొందించుకోకపోవటంతో గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ, రెవెన్యూ, రహదారులు భవనాలు, రవాణాశాఖలకు చెందిన బదిలీ మార్గదర్శకాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విధివిధానాల రూపకల్పలోనే వివిధ శాఖలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



## కూటమి ప్రభుత్వంలో.. విద్యావ్యవస్థలు నిర్వీర్యం.!

ఆంధ్ర ప్రగతి తాడేపల్లి ఆగస్టు 30:

గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ ఘటనపై సీఎం జగన్ స్పందించారు. వాష్‌రూమ్‌లో హిడెన్ కెమెరాలు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఈ ఆరోపణలు అత్యంత తీవ్రమైనవన్నారు.విద్యార్థుల జీవితాలను అతలాకుతలం చేసే ఘటన ఇదని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబుగారూ ఇకనైనా మేలుకోండని.. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుకోకడంటూ ఫైర్ అయ్యారు. ముఖ్యమంత్రి కొడుకే విద్యాశాఖ మంత్రి కావడంతో అసలు ఏమీ జరగలేదన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 నెలల్లో విద్యావ్యవస్థలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయని ఆరోపించారు.ప్రతిపక్షపార్టీపై బురదజల్లుడు వ్యవహారాలు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమల్లో ప్రభుత్వ పెద్దలు, యంత్రాంగం అంతా మునిగిపోయి పాలనను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ సహా గవర్నమెంటు రెసిడెన్షియల్ స్కూళ్లలో కలుషితాహారం కారణంగా వందలమంది విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నా.. వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా.. ప్రభుత్వం స్పందన అత్యంత దారుణంగా ఉంది. విద్యాసంస్థలపై పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందన్నారు. ఈ మేరకు జగన్ తన X ఖాతాలో పోస్ట్ చేశారు.

## రాష్ట్రంలో మియావకీ విధానంలో వనాల అభివృద్ధి.!



-తక్కువ విస్తీర్ణంలో తక్కువ ఖర్చుతో పచ్చదనం పెంపు.
-మొక్కలను పెంచడం, సంరక్షించడం అలవాటుగా తీసుకోవాలి.
-రాష్ట్రాన్ని 50 శాతం పచ్చదనంతో నింపే బాధ్యతను తీసుకుందాం.
-గత ప్రభుత్వ హయాంలో రూ.19 వేల కోట్ల ఎర్రచందనం, సహజ వనరలు దోపిడీ.
-మేం పచ్చదనం పెంపునకు ప్రాధాన్యం ఇస్తాం.
-శుక్రవారం మంగళగిరిలో జరిగిన వనమహోత్సవంలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రాబాబునాయుడి తో కలిసి పాల్గొని, ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.

2లో



## వైసిపికి మరో ఇద్దరు ఎమ్మెల్సీలు రాజీనామా.!

అమరావతిఆంధ్ర ప్రగతి ఆగస్టు 30:
వైసీపీకి మరో షాక్ తగిలింది.. ఇన్న ఇద్దరు రాజ్యసభ సభ్యులు పార్టీకి గుడ్ బై చెప్పగా నేడు మరో ఇద్దరు ఎమ్మెల్సీలు ఆ పార్టీని వీడారు.. గవర్నర్ కోటాలో ఎన్నికైన కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే కోటాలో ఎంపికైన బల్లి కళ్యాణ చక్రవర్తి లు నేడు తన ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు.. అలాగే పార్టీకి సైతం గుడ్ చెప్పారు. ఈ మేరకు వారు నేడు అమరావతిలో ఒక ప్రకటన విడుదల చేశారు.. తమ ఎమ్మెల్సీ రాజీనామా లేఖలను మండలి చైర్మన్ పంపనున్నట్లు చెప్పారు.. పార్టీ రాజీనామా లేఖలను ఇప్పటికే ఆ పార్టీ అధినేత జగన్ కు పంపినట్లు చెప్పారు..


## కృష్ణమ్మ ఉగ్రరూపం..



2లో

శ్రీశైలం, నాగార్జున సాగర్ డ్యామ్ గేట్ల ఎత్తివేత.!

## గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ ఘటనపై విచారణ ఆదేశించిన సిఎం.!



2లో





2లో

## ముంబై నటి కేసు లో ఐపీఎస్ లకు బిగుస్తున్న ఉచ్చు.!

ముంబై హీరోయిన్ కాదంబరి జిత్వానీకి వైసీపీ చిత్రహింసలు వ్యవహారంలో వివరాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# హరితాంధ్రప్రదేశ్ కోసం అడుగేద్దాం....



ఆంధ్ర ప్రగతి మంగళగిరి ఆగస్టు30:
"హరితాంధ్ర కోసం అడుగేద్దాం.. ప్రతి ఒక్కరం మొక్కలు నాటుదాం" అన్న సమున్నత లక్ష్యంతో భవిష్యత్ లో రాష్ట్రంలో 50 శాతం విస్తీర్ణం గ్రీన్ కవర్ వచ్చేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని వనమహోత్సవం-2024 సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. శుక్రవారం మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఎకో పార్కులో ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనమహోత్సవంలో పాల్గొన్న చిన్నారుల చేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిజ్ఞ చేయించారు. చిన్నారుల భవిష్యత్తే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళు తుందని, ఈ నేపథ్యంలోనే వన మహోత్సవ ప్రతిజ్ఞ చిన్నారుల చేత చేయించడం జరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. అందరం హరిత యజ్ఞంలో పాలుపంచుకుందాం.. ప్రతి ఇల్లు, ప్రతి ఊరు పచ్చదనంతో సింగారిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఇక నుంచి ఎక్కువ మొక్కలు నాటిన వారిని గుర్తించి అలాంటి వారికి ఆగస్టు 15, జనవరి 26 న అవార్డులు అందించి ప్రోత్సహిస్తామని సభాముఖంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు పర్యావరణం మక్కువ ఎక్కువన్నారు. అందుకనే పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా చెట్లు నాటాడు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచాడు. మరి నేడు రాష్ట్రం మొత్తం బాధ్యత తీసుకున్నాడు. అందరం ఆక్సిజన్ తీసుకుంటాం, కానీ ఆక్సిజన్ ఇచ్చే చెట్టును మాత్రం పెంచాలని ఆలోచించమన్నారు. కనీసం సంవత్సరానికి ఒక్కొక్కరు ఒక్కొక్కటి లేదా రెండు చెట్లు నాటితే దాదాపు 10కోట్ల చెట్లు అవుతాయని తెలిపారు. ఈ ఏడాది లక్ష్యం ఒక కోటి చెట్ల నాటడమని, కోటి మొక్కలు నాటితే 0.33 శాతం గ్రీన్ కవర్ పెరుగుతుందని స్పష్టం చేశారు. ఇది ఒక ఉద్యమంలా తీసుకోవాలని తెలిపారు. తొలిసారిగా 1950లో నాడు కేంద్రమంత్రిగా ఉన్న వ్యక్తి వన మహోత్సవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అప్పటి నుండి మనందరం పాటిస్తున్నామన్నారు. తాను 30,40 సంవత్సరాల నుండి రాజకీయ నాయకుడిగా, ముఖ్యమంత్రిగా మొక్కల పెంపకం కార్యక్రమానికి పెద్దపీట వేశానని గుర్తుచేశారు. తన మనస్సుకు దగ్గరుండే కార్యక్రమం వన మహోత్సవం అన్నారు. ఒకప్పుడు పాఠశాలల్లో గార్డెనింగ్ ఉండేది. కానీ నేడు అసలు గార్డెనింగ్ అన్నదే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు . తమ చిన్నప్పుడు స్కూల్ కు వెళ్లి దగ్గరలోని బావుల్లోని నీరు తెచ్చి మొక్కలకు పోసేవాళ్లమని తెలిపారు. ఈ సందర్భంగా మీరు ఎంత మంది మొక్కలకు నీళ్లు పోస్తున్నారని చిన్నారును నేరుగా ప్రశ్నించారు. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం వస్తే అదే నిజమైన స్వర్ణాంధ్రప్రదేశ్ అని ఉద్ఘాటించారు. ఒకప్పుడు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంతో ప్రారంభించాము. అప్పట్లో అదోక విప్లవం. ఆ తరువాత ఇంకుడు గుంతలను ప్రోత్సహించాం. అప్పుడు చాలా మంది నవ్వుకున్నారు. పడే ప్రతి వర్షపు చినుకును భూగర్భజలాలుగా మార్చాలి. భూమినే జలశయంలా మార్చినప్పుడు ఇబ్బందులనేవి ఉండవన్నారు. గతంలో అడవులు చుట్టూ కందకాలు తవ్వించాము. అక్కడ పడిన వర్షపు నీరు కందకాల్లోకి చేరుతుంది.కందకాల మధ్యలో చెక్ డ్యాంలు కట్టడం జరిగింది. దీంతో నీరు ఎక్కడికక్కడ నిలిచి భూగర్భంలోకి వెళ్లి చుట్టూ ప్రక్కల భూగర్భజలాలు పెరుగుతాయి. అంతటి మంచి కార్యక్రమాలు నాడు చేశామని గుర్తుచేశారు. మంగళగిరి ఎకో పార్క్, ఎయిమ్స్, బెటాలియన్ ఇవన్నీ అమరావతి రాజధాని నడిబొడ్డున ఉండటం గర్వకారణమన్నారు. ఎకో పార్కును చూస్తుంటే ఎటు చూసినా పచ్చదనం అలుముకుని సుందరంగా ఉంది, కళ్లకు ఇంపుగా ఉంది. ఇక్కడే ఉండిపోవాలని అనిపిస్తుంది. మనస్సు ఆహ్లాదంగా ఉందన్నారు. ప్రతి రోజూ ఉదయం పార్క్ లో 300 మంది వాకింగ్ చేస్తున్నారు. వారి సంఖ్య 3వేలు కావాలన్నారు.

అమరావతి ప్రాంతం అన్ని విధాల అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. గతంలో హైదరాబాద్ లో గుట్టలు, కొండలు అలాంటి సమయంలో చెట్లు పెంచాం, రోజుకు లక్ష నుంచి 5 లక్షల వరకు మొక్కలు నాటాం. దీంతో నేడు ప్రపంచంలోనే హైదరాబాద్ గ్రీన్ సిటీగా గుర్తింపు పొందిందని వివరించారు. 2014లో మిషన్ హరితాంధ్రప్రదేశ్ కు శ్రీకారం చుట్టాం. అప్పుడు 50 శాతం గ్రీన్ కవర్ రావాలని లక్ష్యం పెట్టుకున్నామన్నారు. రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ రావాలంటే 26 జిల్లాల్లోనూ మొక్కలు పెంచే కార్యక్రమం ఉద్యమంలా చేపట్టాలి. అందుకనే డ్రోన్ ల ద్వారా విత్తనాల బంతులను చల్లి మొక్కలు పెరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ చెట్లు పెంచే కార్యక్రమానికి మనందరం శ్రీకారం చుట్టాలని ఈ సందర్భంగా సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో నగర వనాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. అక్కడ జపనీస్ టెక్నాలజీ మియావకీ అనే కార్యక్రమం ద్వారా ఒక హెక్టార్ లో మొక్కలు నాటి ఆదర్శంగా తీర్చిదిద్ది, ఆసక్తి ఉన్న వాళ్ల ద్వారా ఉద్యమంలా ముందుకు తీసుకువెళతామన్నారు. నరేగా నిధులను మియావకి కలపడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్న ఉప ముఖ్యమంత్రి సూచన చాలా బాగుందని ప్రశంసించారు. నేడు నదులు, వాతావరణం ఒకటేమిటి అన్ని విధాల కాలుష్యం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క అడవులను నరికి వేస్తున్నాం. మరికొంత మంది కాలువలను, చెరువులను కబ్జా చేస్తున్నారు. పట్టణాలు పెరిగిపోతుండటంతో కాంక్రిట్ మయమైపోతుంది. దీంతో పర్యావరణం పరంగా పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయని వివరించారు. దీనివలన కరువు, కాటకాలు, భారీ తుఫాన్ లు వస్తున్నాయి. అంతేకాకుండా ఇటీవల క్లౌడ్ బరస్ట్ జరుగుతుంది. అంటే ఒకే ప్రాంతంలో కుండపోత వర్షం కురవడం జరుగుతుంది. ఇదే కేరళలో కూడా జరిగింది. ఇవన్నీ తప్పించుకోవాలంటే మొక్కలు నాటడమే పరిష్కారమని సూచించారు.ఉప ముఖ్యమంత్రి , పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణ మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖామాత్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ పర్యావరణాన్ని ప్రేమించేవాడిగా దానిని పరిరక్షించే బాధ్యత కూడా దక్కటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇంతకు ముందు నేను స్వంతంగా మొక్కలు నాటే వాడిని, మరి కొంత మందిని మోటివేట్ చేసేవాడిని, ఇప్పుడు ప్రభుత్వపరంగా కోటి మొక్కలు నాటడానికి బృహత్తర ప్రయత్నం చేస్తున్నాం. వరుణదేవుడు కూడా వర్షం కురిపించి తన శుభాశీస్సులు అందించడం హర్షనీయం. ప్రతిజ్ఞ చేయడం తేలిక, కాని పాటించడం కొంచెం కష్టం, అలాగే చెట్లను కూల్చివేయడం తేలిక కాని చెట్లను పెంచడం, కాపాడటం చాలా కష్టం. మూడుకాళ్ల ముదుసలి అనే చిన్ననాటి పాఠం గుర్తుకువస్తున్నది. ఈనాడు మనం నాటే ప్రతి చెట్టూ మన భావితరాల భవిష్యత్ కోసం నాటుతున్నాం. వాతావరణాన్ని పరిరక్షించుకుంటే తప్ప మనకు మనుగడ లేదు. మన రాష్ట్రంలో వనాలు, అడవుల విస్తీర్ణం 29 శాతం ఉన్నాయి. వాటిని 50 శాతంకు పెంచాలన్నదే మన ముఖ్యమంత్రి గారి ఆశయం. అందులో భాగంగానే వన మహోత్సవంలో భాగంగా కోటి మొక్కలు నాటాలన్న ఆశయంతో ముందుకు సాగుతున్నాము. జూన్, జూలైతో మొదలై నవంబర్ లో వచ్చే కార్తీక వన సమారాధన వరకు మొక్కలు నాటే కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది. మొక్కలు నాటడమే కాదు వాటిని పరిరక్షించుకోవడం కూడా మన బాధ్యత.మొక్కలు నాటడం ఒక్కరితో కాదు ప్రతి ఒక్కరూ భాగస్వాములం అవ్వాలి. దేవాలయాలు, మసీదులు, చర్చ్ లు, ప్రభుత్వ కార్యలయాలు, ప్రైవేటు కార్యాలయాలు ఎక్కడైనా పచ్చదనం పెరగాలన్న సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భగభగలాడే ఎండ వచ్చినప్పుడే నీడ తాలుకూ విలువ తెలుస్తుంది. చెట్లు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా చెట్లు కొట్టివేశారు. కోనసీమలో కొబ్బరిచెట్టును పెద్దకొడుకుగా భావిస్తారు. అరణ్య సూక్తం చదివినప్పుడే ఒక చెట్టు పది మంది సంతానంతో సమానమన్నది స్పష్టమవుతుంది. తక్కువ విస్తీర్ణంలో కూడా పచ్చదనం పెంచడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి. మియావకి అనే జపనీస్ ప్రతిపాధించిన మియావకి ఫారెస్ట్ మెథడ్ ను పాటిస్తే చాలా త్వరగా అడవులు పెరుగుతాయి. అటవీ శాఖ ద్వారా ఆ వివరాలను అందరికి అందేలా చూస్తాం. తక్కువ విస్తీర్ణంలోనే 3 నుంచి 5 సంవత్సరాల తక్కువ కాలంలోనే అడవిని సృష్టించవచ్చు అన్నారు.

కేంద్రమంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ మనం ఒక విత్తనం నాటినప్పుడు విత్తనం భూమిలో ఉంటుంది. డార్క్ నెస్ లో ఉంటుంది. అన్నింటిని చీల్చుకుని బయటకు వస్తుంది. ఇది మన జీవితానికి ఒక పోలిక. చెట్టు సూర్యుడి వైపు ఎదుగుతుంది. అంటే ప్రగతి వైపు కాతి వైపు వెళుతుంది. ఆటుపోట్లను తట్టుకుని నిదానం వెళుతుంది. జీవితం కూడా అలాంటిదే..చెట్ల వేర్లు భాగా విస్తరిస్తాయి. కనపడవు కాని చెట్టును బలంగా నిలబెడుతుంది. అలాగే మన వెనకుండే వారిని ఎప్పుడూ మరవద్దన్నారు.

కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు ఏసురత్నం, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, అటవీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఐఏఎస్ అనంతరాము, అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ,ఇతర ఉన్నతాధికారులు, శాఖాధికారులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మియావకీ విధానంలో వనాల అభివృద్ధి.!

ఆంధ్ర ప్రగతి మంగళగిరి ఆగస్టు 30:
'అరణ్య కాండమ్ చదివితే మొక్కలు, చెట్ల విశిష్టత తెలుస్తుంది. చెట్లు నుంచి మనం ప్రతి రోజూ ఎంత ప్రయోజనం పొందుతున్నామో అర్థం అవుతుంది. వృక్షాలకు మనం ఎంత రుణపడ్డామో తెలుస్తుంది. చెట్టును పదిమంది సంతానంతో సమానంగా చూస్తారు. కోనసీమ ప్రాంతంలో కొబ్బరి చెట్టును ఇంటి పెద్ద కొడుకుగా భావిస్తారు. ఓ చెట్టు చేసే మేలు అంతాఇంతా కాదు. పచ్చదనంతో రాష్ట్రం సుందరంగా, శుభకరంగా ఉంటే అది ప్రజలందరికీ మంచిద'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి ఎకో పార్కులో జరిగిన వన మహోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడుతో కలిసి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. కేంద్ర మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. దేశీయ జాతులైన వేప, గానుగ, రావి చెట్లను కలయికగా చేసి నాటారు. మొక్కలను పెంచి, వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకుంటామని ప్రతినబూనారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.... "పర్యావరణాన్ని ప్రేమించి, దాన్ని పరిరక్షించడం నా మనసుకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది. ఓ మొక్కను నాటి, దాని పరిరక్షణ బాధ్యతలు తీసుకోవడం అదృష్టంగా భావిస్తాను. ప్రతి ఏటా నేను సొంతంగా మొక్కలు నాటి, వాటి పరిరక్షణ చూసేవాడిని. ఇప్పుడు ప్రభుత్వం తరఫున రాష్ట్రం మొత్తం మీద కోటి మొక్కలు నాటే మహా క్రతువును ప్రారంభించడం సంతోషంగా ఉంది. వన మహోత్సవ సమయంలో వరుణుడు కూడా కరుణ చూపడం మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది. చెట్లను పెంచడం బాధ్యతగా తీసుకుందాం గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా చెట్లు నరికేసింది. చెట్టు నరకడం తేలికే. అయితే ఒక చెట్టు పెరగడం ఎంతో కష్టం. ఆ చెట్టు ఇచ్చే ఫలితాలు ఎంతో విలువైనవి.



మన రాష్ట్రంలో 29 శాతం పచ్చదనం ఉంది. దీన్ని 50 శాతానికి పెంచాలి. దీన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. నవంబరు నెల కార్తీక వనసమారాధనల వరకు ఈ వన మహోత్సవం సాగుతుంది. అప్పటి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను పెంచి, అవి పెద్దవి అయ్యేలా సంరక్షణ కూడా తీసుకోవాలి. సమష్టిగా మొక్కలను పెంచడం మేలు. మొక్కలను నాటిన వెంటనే పెద్దవి కావు కానీ... వాటి ఫలాలు వచ్చే తరానికి అందుతాయి.

కూటమి ప్రభుత్వంలో మొక్కల పెంపకం మీద ఎక్కువగా దృష్టి పెడతాం. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు నాటేలా చూడాలి. తక్కువ స్థలంలో, అడవులు పెంచే పద్ధతిని అవలంభించాలి. జపాన్ కు కెందిన మియావకీ ఫారెస్ట్ మెథడ్ లో తక్కువ విస్తీర్ణంలో, తక్కువ ఖర్చుతో అడవుల్ని పెంచే పద్ధతి ఉంది. ఈ పద్ధతి వల్ల వేగంగా అడవులు, పచ్చదనం పెరుగుతుంది. రాబోయే అయిదేళ్లలో అడవులను తలపించే వనాలు సిద్ధం అవుతాయి. వీటిపై ప్రతి ఒక్కరం దృష్టిపెడదాం. దీనిపై ఓ విధానాన్ని, సూచనలను ప్రభుత్వం తరఫున ఎప్పటికప్పుడు ప్రజలకు చెబుతాం" అన్నారు.


ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏసురత్నం, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్, అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాము, అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి, జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణమ్మ ఉగ్రరూపం..

ఆంధ్ర ప్రగతి శ్రీశైలం ఆగస్టు30:
రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఎగువన ఉన్న కర్ణాటకలో కూడా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కృష్ణమ్మ మరోసారి పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం జలాశయానికి వరదనీరు పోటెత్తుతోంది. దీంతో శ్రీశైలం డ్యామ్ మొత్తం 10 గేట్లను అధికారులు 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు నేరుగా నాగార్జునసాగర్ కు చేరుతోంది.
ప్రస్తుతం శ్రీశైలం డ్యామ్ కు ఇన్ ఫ్లో 2,86,434 క్యూసెక్కులుగా ఉండగా... ఔట్ ఫ్లో 3,48,235 క్యూసెక్కులుగా ఉంది. డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా... ప్రస్తుత నీటిమట్టం 884.80 అడుగులుగా ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా... ప్రస్తుత నీటి నిల్వ 214.3637 టీఎంసీలుగా ఉంది. కుడిగట్టు, ఎడమగట్టు రెండు విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.
మరోవైపు శ్రీశైలం నుంచి భారీగా వరదనీరు వస్తుండటంతో నాగార్జునసాగర్ కూడా నిండుకుండలా మారింది. అధికారులు 20 గేట్లు ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ గేట్లను ఎత్తవేయడంతో... ఆ సుందర దృశ్యాలను వీక్షించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు.

# గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ ఘటనపై విచారణ ఆదేశించిన సిఎం.!

**-ఉదయం నుంచి జరిగిన విచారణపై వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి.**
**-తప్పు జరిగిందని తేలితే అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశం.**




ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 30:
కృష్ణా జిల్లా గడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ లో రహస్య కెమెరాలు పెట్టారనే అంశంపై జరుగుతున్న విచారణను సిఎం చంద్రబాబు నాయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఉదయం ఘటన విషయం తెలిసిన వెంటనే జిల్లా అధికారులను, మంత్రి కొల్లు రవీంద్రను, జిల్లా ఎమ్మెల్యేలను కళాశాలకు వెళ్ళాలని ఆదేశించిన ముఖ్యమంత్రి.....ఉదయం నుంచి అక్కడ జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. కలెక్టర్, ఎస్పీలతో ఫోన్ లో మాట్లాడి విచారణ సాగుతున్న విధానంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆందోళనను, ఆవేదనను పరిగణలోకి తీసుకుని పటిష్ఠ దర్యాప్తు జరపాలని ఆదేశించారు. రహస్య కెమెరాల ద్వారా వీడియోల చిత్రీకరణ జరిగిందన్న విషయంలో...నేరం రుజువైతే కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మన ఇంట్లో ఆడబిడ్డలకు కష్టం వస్తే ఎలా స్పందిస్తామో...అంతే సీరియస్ గా స్పందించి నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. ఆందోళనలో ఉన్న వారికి ఒక భరోసా కల్పించాలని సిఎం ఆదేశించారు. విద్యార్థుల ఫిర్యాదును యాజమాన్యం నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణపైనా విచారణ జరపాలన్నారు. కాలేజ్ యాజమాన్యం, అధికారుల అలసత్వం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థినుల వద్ద ఆధారాలు ఉంటే...నేరుగా తనకే పంపాలని ఆయన కోరారు. స్టూడెంట్స్ ఎవరూ అధైర్య పడవద్దని, తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.....ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఆడబిడ్డల పట్ల తప్పుగా ప్రవర్తించారని తేలితే కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి మూడు గంటలకు ఒక సారి తనకు ఘటనపై రిపోర్ట్ చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. వ్యవహారంపై ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని సూచించారు.

# ముంబై నటి కేసు లో ఐపీఎస్ లకు బిగుస్తున్న ఉచ్చు.!

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 30:
ముంబై హీరోయిన్ కాదంబరి జిత్వానీకి వైసీపీ చిత్రహింసలు వ్యవహారంలో వివరాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అన్ని కోణాల్లో వివరాలు సేకరించడంపై అధికారులు దృష్టి పెట్టిన నేపథ్యంలో కింద స్థాయి అధికారులు కీలక విషయాన్ని వెల్లడించారు.మాజీ ఇంటెలిజెన్స్ బాస్ పీఎస్ఆర్ ఆంజనేయులు చెబితేనే ఇదంతా చేశామని బయటపెట్టారు. దీంతో ఆంజనేయులు మెడకు ఉచ్చు బిగుసుకుంటోంది.తాము ఆయన చెబితేనే చేశామని కింద స్థాయి అధికారులు తేల్చిచెబుతున్నారు. ఇప్పటికే కొంతమంది పోలీస్ అధికారులు.. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ సమాచారం ఆధారంగానే అధికారులు కేసు కూపీ లాగుతున్నారు. అయితే




వచ్చి ఆ మేరకు స్టేట్‌మెంట్ ఇవ్వాలని కింది స్థాయి అధికారులకు ఆదేశాలు వెళ్లినట్టు తెలుస్తోంది. అక్రమ నిర్బంధం, ట్రాన్సిట్ వారెంట్ లేకుండా తీసుకురావడం, మహిళలు లేకుండా ఇద్దరు మహిళలను తీసుకురావడం వంటి అంశాలపై విచారణ అధికారులు సీరియస్ అయినట్టు సమాచారం.ఇందులో నేరుగా పాల్గొన్నది ఎవరు?, తెర వెనుక ఉండి పాల్గొంది ఎవరు? అనే అంశాలపై విచారణ జరుపుతున్న అధికారులు దృష్టిపెట్టారు. ఇప్పటికే ఇందులో పాల్గొన్న ఒకరిద్దరు అధికారులను పిలిపించి పోలీస్ బాసులు మాట్లాడారు. కాగా ఈ వ్యవహారం ఐపీఎస్ వర్గాల్లో కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇలా చేయడం మంచిది కాదంటూ మెజారిటీ ఐపీఎస్‌లు అభిప్రాయపడుతున్నారు. ఇది చేయించిన వారు సేఫ్‌గా ఉన్నారని, చేసిన వారు ఇరుక్కున్నారని పోలీస్ అధికారులు విచారం వ్యక్తం చేస్తున్నారని సమాచారం.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 31 ఆగష్టు 2024

# మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత సమిష్టిగా తీసుకోవాలి



**-రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**
**-చంటి పిల్లలను పెంచిన తరహాలో మొక్కల పెంపకాన్ని చేపట్టండి.**
**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 30:
ప్రతి ఒకరు మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను సమిష్టిగా తీసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. శుక్రవారం నూనేపల్లెలోని నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన 75వ వన మహెూత్సవ వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్, చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారులు రామకృష్ణ, బిఎన్ఎస్ మూర్తి, అటవీ శాఖ డిడి అనురాగ్ మీన, డిఎఫ్ఓ శివ శంకర్ రెడ్డి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆనంద్ కుమార్, 21వ వార్డు కౌన్సిలర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వన మహెూత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని... ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత సమిష్టిగా తీసుకోవాలని సూచించారు. 1984లో కూడా అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని విరివిగా చేపట్టారన్నారు. 1995, 96 లో తాను మునిసిపల్ మంత్రిగా ఉన్నప్పుడు ప్రతి శనివారం శ్రమదానం పేరిట పరిశుభ్రంగా ఉంచడంతోపాటు మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నంద్యాల నుంచి కర్నూలు, ఆళ్లగడ్డ వెళ్లే ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా అంతా చింత చెట్లు విరివిగా ఉండేవని ప్రజా అవసరాల నిమిత్తం చెట్లను తొలగించేసి నాలుగు లైన్ల రహదారులను నిర్మించుకున్నామన్నారు. భారతదేశ ఖనిజ సంపద కాపాడేందుకు 1971లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఐఎఫ్ఎస్ ను ఏర్పాటు చేసి పార్లమెంటులో అమెండ్మెంట్ తీసుకొచ్చారన్నారు. అటవీ ప్రాంతంలో రాక్ ఫిల్లింగ్ డ్యాం ఏర్పాటు చేసేందుకు అన్వేషించామన్నారు. ప్రాచీన కాలంలో అశోకుడు రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటించారని అదే తరహాలో అవకాశం ఉన్న ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు విరివిగా నాటి సంరక్షణ చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. నంద్యాల జిల్లాలో 9.64 లక్షల హెక్టార్ల భూమి ఉందని... అందులో 3.14 లక్షల హెక్టార్లలో 32.8 శాతం పర్యావరణ సంబంధమైన అటవీ భూముల విస్తీర్ణం వుండి మన నంద్యాల జిల్లా అదృష్టం చేసుకుందన్నారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాలలో పచ్చదనం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గత సంవత్సరం భూగర్భ జలాల నీటిమట్టం దిగువకు పోవడం వల్ల నీటి కొరత ఏర్పడిన11 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశామన్నారు. చంటి పిల్లలను ఏవిధంగా పెంచుతామో అదేవిధంగా మొక్కలను కూడా పెంచి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకొని సంరక్షించి జిల్లాలో వాటర్ టేబుల్ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు వనంలా పెంచితే భూగర్భ జలాలు పెరిగి ప్రకృతి జీవవైవిధ్యంలో సమతుల్యత ఉంటుందని కలెక్టర్ తెలిపారు. నేటి నుండి ప్రారంభమైన మొక్కలు నాటే కార్యక్రమం కార్తీక పౌర్ణమి వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని ఆమె వెల్లడించారు. మెడికల్ కాలేజీ ఆవరణంలో 1500 మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకున్నారని వాటి సంరక్షించే బాధ్యతను కళాశాల తీసుకుంటున్న నేపథ్యంలో ఇదే ప్రాంగణంలో ఉన్న తాము కూడా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాను హరిత నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారులు రామకృష్ణ, బిఎన్ఎస్ మూర్తిలు మాట్లాడుతూ 1950 నుండి వన మహెూత్సవం పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి 33 శాతం అడవుల విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు కూడా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రాథమిక హక్కుగా స్వీకరించాలన్నారు. అటవీ నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉంచామని అవసరమైన వారు కావాల్సినన్ని మొక్కలు తీసుకొని నాటాలన్నారు. భారత ప్రధాని ఒక చెట్టు తల్లి పేరుతో నాటాలన్న నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. అటవీ సంపద, చెట్లను సంరక్షిస్తే దేశం సుభిక్షంగా ఉంటుందని వారు తెలిపారు. అంతకుముందు రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ మెడికల్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. గురు రాజా, వెంకటేశ్వర, విజయనికేతన్ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, సుగాలి మెట్ట, ఎల్ కె తాండ సుగాలి నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ 75వ వన మహెూత్సవ కార్యక్రమంలో ఆర్డీఓ మల్లికార్జున రెడ్డి, సబ్ డిఎఫ్ఓ, సూర్యచంద్రరాజు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు ప్రవీణ్ కుమార్, సుబ్బరాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన మెడికల్ కళాశాలలో సౌకర్యాలు మెరుగుపరుస్తాం

**-మెడికల్ కళాశాలను సందర్శించిన రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**







ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 30:
నంద్యాల పట్టణంలో నూతనంగా నిర్మితమైన మెడికల్ కాలేజీలో విద్యను అభ్యసించే ఎంబిబిఎస్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కోర్స్ కు అవసరమయ్యే అన్ని పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం మెడికల్ కళాశాల ఆవరణలో నిర్వహించిన 75వ వన మహెూత్సవ కార్యక్రమ అనంతరం నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారితో కలిసి మంత్రి పరిశీలించారు.
ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ నూతనంగా నిర్మితమై ఉన్న మెడికల్ కాలేజీలో విద్యనభ్యసించే ఎంబిబిఎస్ విద్యార్థులకు అనాటమీ, బయెూ కెమిస్ట్రీ, ఫిజియాలజీ ల్యాబ్ లకు అవసరమయ్యే అన్ని పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆర్ఓ ప్లాంట్, ఫర్నిచర్, ల్యాబ్ పరికరాలు, లెక్చరర్ గ్యాలరీ, హాస్టల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై నివేదికలు ఇవ్వాలని కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆనంద్ కుమార్ ను మంత్రి .సూచించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎపీఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను, కళాశాల అధ్యాపకులను ఆదేశించారు. అనాటమీ, బయెూ కెమిస్ట్రీ, ఫిజియాలజీ ల్యాబ్ లను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. మెడికల్ కళాశాలకు రెండు కొత్త బస్సులు వచ్చాయని డ్రైవర్లు లేని కారణంగా నిరుపయోగంగా ఉన్నాయని కళాశాల వైస్ ప్రిన్సిపల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎపీఎంఎస్ఐడిసి ఇంజినీర్ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన సదుపాయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి ,కలెక్టర్ కు నివేదించారు.

## పాలకమండలిలో వాల్మీకులకు అవకాశం కల్పించండి



ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 30:
ప్రముఖ శైవ క్షేత్రలైన శ్రీశైలం,మహానంది దేవస్థానాల పాలక మండలిలో వాల్మీకులకు అవకాశం కల్పించాలని ఎంవిఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు .దేవస్తానాలలోనే కాక ఇతర నామినేటెడ్ పోస్టులలో కూడా అవకాశం వాల్మీకులకు పాలకులు కల్పించలేదన్నారు. ఇప్పుడున్న తెదేపా ప్రభుత్వం వాల్మీకులకు ఖచ్చితంగా అవకాశం కల్పిస్తుందనే నమ్మకం ఉందని, కొండన్న ఆశాభావం వ్యక్తం చేశారు.శుక్రవారం మహానందిలో వారు మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాలో 2లక్షలకు పైగా వాల్మీకుల ఓటు బ్యాంకు ఉన్నా, నామినేటెడ్ పోస్టులలో వాల్మీకులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని, కనుక ప్రభుత్వం న్యాయ చెయ్యాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రకార్యదర్శి గాజులపల్లె జయరామ్, శ్రీశైల నియెూజకవర్గ నేతలు తలారి రామచంద్రుడు, రాజు,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## క్రాంతి నగరంలో పర్యటించిన

**నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.**





ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 30:నంద్యాల వార్డు పర్యటనలో భాగంగా హరిబాబు ఆధ్వర్యంలో క్రాంతి నగర్ ఏరియాలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పర్యటించారు . అలాగే అక్కడ ప్రజలు అడిగి సమస్యలను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ క్రాంతి నగర్ ఏరియాలో ఎక్కువగా డ్రైనేజీ సమస్య ఉందని డ్రైనేజీ సరింగా లేకపోవడంతో మురికి నీరు మరియు వర్షం నీరు రోడ్ల మీదికి ఇండ్లలోకి రావడం జరుగుతుందని ప్రజలు తెలియజేయడంతో వెంటనే స్పందించిన ఫిరోజ్ త్వరలోనే డ్రైనేజీలు ఏర్పాటు చేసి మురికి నీటి సమస్యను పరిష్కరిస్తామని అదేవిధంగా రోడ్లను కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు . అనంతరం క్రాంతి నగర్ టిడిపి నాయకులు ఎన్ఎండి ఫిరోజ్ గారిని ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రైల్వే శ్రీనివాసులు, వెంకటేశ్వర రెడ్డి, రమణారెడ్డి, సుబ్బరాయుడు, ఆటో సుబ్బరాయుడు, మహేంద్ర, మిలిటరీ శ్రీనివాసులు, నాయుడు, రాజశేఖర్ , జనసేన సురేష్ , దండే నరేష్ , కుమార్ , అబ్దుల్ రోఫ్ , మిద్దె చిన్న ఉసేని తదితరులు పాల్గొన్నారు.

## ఫరూక్ నగర్ లో వార్డు పర్యటన నిర్వహించిన ఎన్.ఎం.డి ఫిరోజ్ , ఎన్.ఎం.డి ఫయాజ్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 30:
నంద్యాల వార్డు పర్యటనలో భాగంగా ఫరూక్ నగర్ నందు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, ఎన్.ఎం.డి ఫయాజ్ పర్యటించి ప్రజలు అడిగి సమస్యలను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఫరూక్ నగర్ డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని , త్రాగునీరుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని , వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల్లో తనకు నచ్చిన వారికే పథకాలు నచ్చని వారికీ పథకాలు అందకుండా చేయడం జరిగిందని, వార్డులో కృంగిపోయిన కరెంటు స్తంభాలు, వేలాడుతూ కరెంటు తీగలు వీధీ దిపాలు లేక రాత్రుల్లో ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఫరూక్ నగర్ ఇళ్ల మధ్యలో వర్షపు నీరు నిల్వ ఉండటం , కంప చెట్లు ఏపుగా పెరగడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని. అందుకే మన ఊరు మన బాధ్యత అను కార్యక్రమంలో భాగంగా ఎన్ఎండి ఫిరోజ్ ఫరూక్ నగర్ వార్డు పర్యటనకు చేరుకోవడంతో వార్డు నాయకులు కార్యకర్తలు సచివాలయ సిబ్బంది





ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఎన్ఎండి ఫిరోజ్ వార్డు మొత్తం ఇంటింటికి తిరిగి ప్రజలను నేరుగా కలుసుకొని వాళ్ళ సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వార్డు ప్రజలు తమ వార్డులో ఉన్న వివిధ సమస్యలను ఎన్ఎండి ఫిరోజ్ దృష్టికి తీసుకురావడం జరిగింది. ఎన్ఎండి ఫిరోజ్ గారు ఫరూక్ నగర్ లో ఏళ్ల తరబడిగా నెలకొన్న కఠిన సమస్యల గురించి ప్రభుత్వ అధికారులతో అక్కడికక్కడే చర్చించి వాటిని త్వరతగతిన పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయ్యాలని రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ దృష్టికి తీసుకువచ్చి వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించేలా కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఎంతో మంది అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు అందకపోవడంతో సచివాలయ సిబ్బందికి వాటి పై తక్షణం నివేదిక అందించాలని తెలపడం జరిగిందన్నారు. అలాగే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్ఎండి ఫరూక్ కు అత్యధిక మెజారిటీతో గెలిపించిన ఫరూక్ నగర్ వార్డు ప్రజలు మమ్మల్ని ఇంతలా ఆదరించిన వారి సమస్యలను పరిష్కారం చేసేందుకు కచ్చితంగా కృషి చేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు కార్యకర్తలు ప్రజలు మున్సిపల్ అధికారులు సచివాలయ సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## నంద్యాల మీదుగా భువనేశ్వర్ - బెలగంకి పూజా వారంతపు స్పెషల్ హుమసఫర్ ఎక్స్ప్రెస్ రైలు

**-నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 30:
ట్రెయిన్ నెంబర్:02813 07- సెప్టెంబర్ -24 వ తేది భువనేశ్వర్ నుండి బయలుదేరి నంద్యాలకు 08- సెప్టెంబర్-24 ప్రతి ఆదివారం మధ్యానం 2 గంటలకు చేరుకొని గుంతకల్లు మీదుగా బెలగం కి మరుసటిరోజు ఉదయం 3 గంటలకు చేరుకుంటుందని, ట్రెయిన్ నెంబర:02814 బెల్గం నుండి భువనేశ్వర్ స్పెషల్ పూజా ఎక్స్ప్రస్ ప్రతి సోమవారం ఉదయం 7:30 కు బెల్గం నుండి బయలుదేరి నంద్యాలకు సాయంత్రం 6:30కు చేరుకొని విజయవాడ, వైజాగ్ మీదుగా భువనేశ్వర్ కు మంగళవారం రోజు మధ్యానానికి చేరుకుంటుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి శుక్రవారం తెలిపారు.ఈ రైలు 07.09.24 నుండి 30.11.24 వ తేది వరకు ప్రతి వారం 13 ట్రిప్పులు తిరుగుతుందని, నంద్యాల పార్లమెంటు వాసులు ఈ వారంతపు ఎక్స్ప్రస్ నీ ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. ఈ రైలు నంద్యాల జిల్లాలో నంద్యాల, డోన్ స్టేషన్ లలో ఆగుతుందని తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# నిరుద్యోగ యువతి యువకులకు సెప్టెంబర్ 3న మెగా జాబ్ మేళా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 30: నంద్యాల పట్టణంలోని నిరుద్యోగ యువతీ యువకులకు సెప్టెంబర్ మూడవ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ ఎండి ఫరూక్ ఆదేశాల మేరకు నంద్యాల నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే సదుద్దేశంతో నంద్యాల పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు సెప్టెంబర్ 3వ తేదీన మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని నంద్యాల నియోజకవర్గ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎన్ ఎండి ఫిరోజ్ తెలిపారు. ఈ మేరకు ఎన్ ఎండి ఫిరోజ్ చేతులా మీదుగా మెగా జాబ్ మేళా పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ జాబ్ మేళాలో దాదాపు 8 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, జీతం రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందని, 10వ తరగతి, ఇంటర్ డిగ్రీ ఆపై చదివిన నిరుద్యోగులు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి శాఖ జిల్లా అధికారులు ప్రతాప్ రెడ్డి, కె సుబ్బాన్న, దూదేకుల హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 3 నుండి పొలం పిలుస్తోంది కార్యక్రమం

### -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.




ఆంధ్రప్రగతి నంద్యాల, ఆగస్టు 30: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల 3 నుండి జిల్లాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో పొలం పిలుస్తోంది కార్యక్రమ గోడపత్రికను వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబరు 3 నుండి జిల్లా వ్యాప్తంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టాలని వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. ప్రతి మంగళవారం, బుధవారం వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్లి నూతన పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులు, పంటల మార్పిడి, ఎరువుల వాడకం తదితర వాటిపై వివరించి రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు వేసిన పంటలపై అధిక దిగుబడులు సాధించేలా సలహాలు, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, పశుసంవర్ధక అధికారి గోవింద నాయక్, మార్కెటింగ్ ఏడి రెహమాన్, వ్యవసాయ సాంకేతిక అధికారి అయూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఈరోజే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ.

### -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 30: ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను ఈ నెల 31వ తేదీ శనివారం రోజున ఇంటింటికీ తిరిగి పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ జూమ్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి పెన్షన్ల పంపిణీపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబరు 1 ఆదివారం సెలవు రోజు కావడంతో ఆగస్టు 31న ఇంటింటికీ తిరిగి పెన్షన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2,19,046 మందికి వివిధ కేటగిరీల్లో పెన్షన్ల కింద రూ.92.56 కోట్ల లబ్ధి చేకూరుతుందన్నారు. పెన్షన్ల పంపిణీకి దాదాపు 8800 మంది సచివాలయ సిబ్బందితో పాటు ఇతర శాఖల సిబ్బందిని కూడా వినియోగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులకు కూడా ముందస్తు సమాచారం ఇవ్వాలని అధికారులను సూచించారు. 31వ తేదీ ఉదయం 6 గంటలకు అన్ని సచివాలయాల పరిధిలో పెన్షన్ల పంపిణీని ప్రారంభించి అదేరోజు సాయంత్రానికి నూరుశాతం పెన్షన్ల పంపిణీ పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా లబ్ధిదారులు పెన్షన్లు అందుకోని పక్షంలో సెప్టెంబరు 2న అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

# వినాయక మండపాల ఏర్పాటు కై సింగల్ విండో విధానం

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 30: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక మంటపం ఏర్పాటు చేయు ప్రజల కోసం ప్రత్యేకంగా ఒక సింగిల్ విండో క్లియరెన్స్ విధానం తీసుకుని వచ్చింది. ఇంతకు ముందు వినాయక మంటపం ఏర్పాటు కోసం ప్రజలు అగ్నిమాపక శాఖ, పురపాలక శాఖ, విద్యుత్ శాఖ మరియు పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోవలసి ఉండేది. దీనికోసం ప్రజలు ఆయా శాఖల చుట్టూ తిరగవలసి వచ్చేది. ప్రజల వెసులుబాటు కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సింగిల్ విండో క్లియరెన్స్ విధానం రూపొందించినది. ప్రజలు ganeshutsav.net అనే వెబ్సైట్ నందు గణేష్ మంటపం ఏర్పాటు చేయదలచిన కమిటి సభ్యుల వివరాలు, మంటపం ఏర్పాటు చేయు ప్రదేశం, ఏ పోలీసు స్టేషన్ పరిధి లోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మంటపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ ఏ సమయం లో చేస్తారు, ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలి.

అలాగే ఇదే సౌకర్యాన్ని ప్రజలు "7995095800" మొబైల్ నంబర్ కు వాట్సాప్ ద్వారా "హాయ్ " అని సందేశం పంపిస్తే చాలు, నిరభ్యంతర పత్రం కోసం అనుసరించవలసిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ ద్వారా ప్రజల యొక్క మొబైల్ ఫోన్ కు వస్తుంది. దరఖాస్తు సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్.హెచ్.ఓ కు వెళ్తుంది. ఎస్.హెచ్.ఓ ఆధ్వర్యంలో పురపాలక శాఖ, అగ్నిమాపక శాఖ మరియు విద్యుత్ శాఖల యొక్క సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి మంటపం ఏర్పాటు చేయు ప్రదేశమును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి సానుకూలంగా ఉంటే యువర్ కోడ్ తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారు. అనంతరం ఎస్.హెచ్.ఓ వాటిని పరిశీలించి వెంటనే నిరభ్యంతర పత్రమును జారీ చేస్తారు. ఈ నిరభ్యంతర పత్రాన్ని ప్రింట్ తీసి గణేష్ మంటపంలో ఉంచవలెను.




పోలీసువారు సందర్శన సమయములో క్యూఆర్ కోడ్ ని స్కాన్ చేసి తనిఖీ చేస్తారు.

**ఈ సందర్బంగా జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఐపీఎస్ వారు కొన్ని సూచనలు చేసినారు.**

1. నంద్యాల జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నది, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ను ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 32 పోలీస్ ఆక్ట్ ప్రకారం లేదా 223 బి.ఎన్.ఎస్ సెక్షన్ ప్రకారం చర్యలు తీసుకొని బడతాయని తెలియచేసినారు.
2. వినాయక మండపాలు నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకొని వేడుకల యందు ఎటువంటి శాంతి భద్రతల, మతపర సంఘర్షణల సమస్యలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని నంద్యాల పోలీసు వారి విజ్ఞప్తి.
3. ఉత్సవ విగ్రహాలను రోడ్డుకు అంతరాయం లేకుండా ట్రాఫిక్కు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలని
4. వినాయక చవితి మండపాల వద్ద ఎక్కువ శబ్ద కాలుష్యం చేసే స్పీకర్లను ఉపయోగించరాదని, స్పీకర్లను ఉదయం 6.00 గంటల నుండి రాత్రి 10.00 గంటల వరకు మాత్రమే వినియోగించాలని,
5. ఉత్సవ కమిటీ సభ్యులు ఉత్సవ మండపాల వద్ద భక్తుల యొక్క క్యూ లైన్ లను పాటించే విధముగా చూడవలసిన బాధ్యత ఉత్సవ కమిటీ వారిదేనని,
6. ఉత్సవ మండపాలు వద్ద విగ్రహాలకు భద్రతగా కమిటీ సభ్యులు రాత్రులు మండపాలు వద్దనే ఉండాలని
7. వినాయక నిమజ్జనం చేసే సమయాలను మరియు రూట్ మ్యాప్ ను ముందుగా పోలీసు వారికి తెలియ చేయాలి అని,
8. వినాయక చవితి మండపాల వద్ద ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం కలగకుండా వాహనాలను ఒక ప్రక్కగా పార్కింగ్ చేసేలాగా ఏర్పాట్లను కలగా చేయాలి అని,
9. ఉత్సవ మండపాలలో మండే స్వభావం కలిగినటువంటి వాటితో జాగ్రత్తలు తీసుకుంటూ విద్యుత్ అలంకరణల పట్ల తగిన జాగ్రత్తలు వహించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని,
10. ఉత్సవ కమిటీలు ఉత్సవ పందిర్లను ఏర్పాటు చేసుకునే విషయాలలో సంబంధిత అధికారులు యొక్క అనుమతిని పొందాలని,
11. వినాయక ఉత్సవ మండపాల వద్ద గాని ఊరేగింపులలో గాని బాణసంచాను ఉపయోగించరాదని,
12. వినాయక నిమజ్జనం సమయంలో ఆశీల డాన్సులను గాని డీజే శబ్దాలు కలిగే వాడుకుని నిరోధించాలని, వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులకు నంద్యాల జిల్లా పోలీస్ యంత్రాంగం సహాయ సహకారాలను అందిస్తుందని ఉత్సవ కమిటీ సభ్యులు అందరూ పోలీస్ డిపార్ట్మెంట్ సూచించే సూచనలు ఆదేశాలను పాటించి ఆనందంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని, వినాయక చవితి విగ్రహాలను ఏర్పాటు చేసే కమిటీ వారు అన్ని శాఖల యొక్క అనుమతులు తప్పనిసరి అని, అనుమతుల సులభతరం చేయడానికి కోసం ప్రభుత్వం వారు సింగిల్ విండో విధానాన్ని సిద్ధం చేస్తోంది అని, పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేసే మండపాలు వద్ద తప్పనిసరిగా తాత్కాలిక సీసీ టీవీ నిఘా మరియు పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలి అని జిల్లా ఎస్పీ గారు ఈ ప్రకటన ద్వారా తెలియ చేసినారు.

# ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నిజాలు తెలుసుకొని మాట్లాడాలి

ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ ఆగస్టు 30: ఎవరి హయాంలో. అభివృద్ధి జరిగిందో ప్రజలందరికీ తెలుసు. ఏదో ప్రెస్ మీట్ పెట్టినాము, మాట్లాడినాము అనేది కాదు. మనం ఏదైనా మాట్లాడితే దానికి ఒక అర్థం ఉండాలి. ఎవరి హయాంలో ప్రభుత్వ ఆసుపత్రి- 30 -పడకల నుండి 50 పడకలుగా తయారైందో అక్కడ ఉండే శిలాఫలకాలను చూస్తే తెలుస్తాది. తరువాత అదే ఆసుపత్రికి ఆరు కోట్లు శాంక్షన్ కావడం జరిగినది, కాకపోతే ఎలక్షన్ కోడ్ రావడం వల్ల ఆగిపోయినది. అంతేకాకుండా ఆళ్లగడ్డలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తులు వారి యొక్క సర్వే నంబర్లలో ఉన్నటువంటి లేఅవుట్లు రిజిస్టర్ కావని పత్రిక ద్వారా తెలపడం జరిగినది, మరి మీ సర్వే నెంబర్ లో ఉన్నటువంటి లేఅవుట్లు మరియు ఆస్తులు ఏ విధంగా రిజిస్టర్ అవుతున్నాయి. అంతేకాకుండా కందుకూరు రోడ్ లో ఉన్నటువంటి ఇండోర్ స్టేడియం ఎదురుగా -369/1 -సర్వే నెంబర్లో -6600 -గజాల స్థలం అనుమతులు లేని లేఔట్, మరి మీరు ఏలా అమ్ముకుంటున్నారు? అంటే ప్రజలకు ఒక న్యాయము నీకు ఒక న్యాయమా? లేకపోతే ఎమ్మెల్యే చేసుకోవచ్చని రాజ్యాంగం లో ఏమైనా రాసి ఉందా?

అంతేకాకుండా యాదవ సహోదరుల యొక్క భూములు ఆక్రమించుకొని వాటి యొక్క విలువ పెరగాలని ఉద్దేశంతో బస్టాండు కందుకూరు రోడ్డుకు మీ తండ్రి మార్చడం జరిగినది. ప్రజలు అక్కడికి పోనీకి చాలా ఇబ్బంది పడేవారు. రాత్రులు అయితే ఇంకా దారుణం. 2004-లో మా పెదనాయన గంగుల ప్రతాప్ రెడ్డి గారు ఎమ్మెల్యే అయిన వెంటనే బస్టాండ్ ను తీసుకొని వచ్చి ఇప్పుడున్న చోట పెట్టడం జరిగినది. ఈరోజు ఎమ్మెల్యే ఏమీ చేయలేదని చెప్తున్నావు, ఆళ్లగడ్డ నుండి అహోబిలానికి రోడ్డు వేసింది -:ఎవరు నువ్వా? నేనా?. మొన్న అదే రోడ్డు మీద నువ్వు అహోబిలంకు పోయి

సగం సగం రేటుకు పాడిన టెండర్లు ఓపెన్ చేసి వచ్చావు. ఎప్పుడూ -40- లక్షలకు పోయే పాట ఈసారి- 19 -లక్షల -30- వేలకు ఏ విధంగా పోయింది అంటే మిగతా -20 -లక్షలు ఎవరు జేబులోకి పోయింది. నేను ఎమ్మెల్యేగా గెలిస్తే గేట్లు ఎత్తివేస్తానని చెప్పావు. ఇప్పుడు నువ్వు ఎమ్మెల్యే అయినావు గేట్లు ఎత్తి వెయ్. ఒక మాట చెప్తే ఆ




మాట మీద నిలబడాలి.

ఆళ్లగడ్డలో వసూలు జరుగుతున్నాయ్ ఆర్డిఓ ఎంక్వయిరీ వేస్తాను అని అంటున్నావ్, ఆర్డీవో తోనే కాదు ప్రజలతో కూడా ఎంక్వయిరీ చేయించుకో. నిజా నిజాలు ఏంటో బయట పడతాయి. ఉదయం లేచినప్పటి నుంచి మా మీద పడి ఏడవడం కాదు. మీ కూటమి ప్రభుత్వం చెప్పినటువంటి హామీలు ఎక్కడకి పోయాయి? పిల్లలకి అమ్మవడి ఇస్తానని చెప్పారు, కేవలం ఆళ్లగడ్డ -కే 5000- ఉద్యోగాలు ఇస్తానని చెప్పావు. ఇవన్నీ ఎక్కడికి పోయాయి. ఇప్పుడు -ఆళ్లగడ్డలో- వసూలు జరుగుతున్నాయా లేదా అనేది ఎవరినీ అడిగినా చెబుతారు. కాబట్టి నోరు ఉందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎవరూ ఊరుకోరు. నేను ఎమ్మెల్యేను, ఏమైనా మాట్లాడతా, ఏమైనా చేస్తా అంటే కనుక అవతల వాళ్ళు ఎవరూ ఊరుకోరు తగిన బుద్ధి చెప్తారు జాగ్రత్త.

# భూములను బలవంతంగా భూసేకరణ చేసిన గ్రీన్ కో సంస్థ పై చర్యలు తీసుకోవాలి.

**- అవినీతికి పాల్పడిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పై విచారణ జరిపించాలి.**

**-రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగానీ సత్య ప్రసాద్ ను కలిసిన సిపిఐ నేతలు.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 30: నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం కందికాయపల్లి గ్రామాల్లో గ్రీన్ సంస్థ ద్వారా పూర్వీకుల నుండి సాగు చేసుకుంటున్న పేద ప్రజల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను 2019 నుండి 2024 వరకు బలవంతంగా భూ సేకరణ చేసి గ్రీన్కో సంస్థ ద్వారా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించడంలో అనేక అవకతవక జరిగాయని విచారణ నిర్వహించి సిఐడికి అప్పజెప్పాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ లు పిర్యాదు చేసారు. ఈసందర్భంగా మీడియా తో మాట్లాడుతూ నంద్యాల జిల్లా గ్రీన్కో సంస్థ ద్వారా పాణ్యం మండలం పిన్నాపురం గ్రామం కందికాపల్లిలో సోలార్ హైడల్ ప్రాజెక్టుల ద్వారా సుమారు వేలకోట్ల రూపాయలతో పరిశ్రమలు స్థాపిస్తా ఉన్నారు ఈ పరిశ్రమల స్థాపనలో రైతుల నుండి భూములను బలవంతంగా లాక్కొని దౌర్జన్యంచేసి భయభ్రాంతులకు గురిచేసి అప్పటి స్థానిక శాసనసభ్యుడిగా ఉన్న కాటసాని రాంభూపాల్ రెడ్డి వేలకోట్ల రూపాయలు అవినీతికి పాల్పడ్డాడని దీని పైన సమగ్ర విచారణ నిర్వహించాలని వారు



మంత్రిని కోరారు ఏళ్ల సంవత్సరాల నుండి రైతులు సాగు చేసుకుంటున్న పచ్చని పొలాలను గ్రీన్ కోసంస్థ కు అప్పజెప్పి రైతులుకు చెల్లించాల్సిన పరిహారంలో చెల్లించకుండగా కేవలం కొందరు డబ్బులు మాత్రమే చెల్లించి మిగతా డబ్బుని ఆయన బలవంతంగా తీసుకున్నారని ఈ విషయంపై ప్రశ్నించిన వారి పైన పోలీసులతో తప్పుడు కేసులు బనాయించి ఇబ్బంది పెట్టారని రైతులు ఎవరికి చెప్పుకోలేక దిక్కు తోచని స్థితిలో ఉన్నారని వారు ఆరోపించారు. పిన్నాపురం గ్రామంలో

1) A/w భూమి :2018, 2021 సంవత్సరం:2759:71 ఎకరాలు 2) అసైన్మెంట్ కమిటీ భూమి 2022 సంవత్సరం:276:64 ఎకరాలు 3) రిజిస్ట్రేషన్ భూమి:343:27 ఎకరాలు, మొత్తం భూమి :3012ఎకరాలు భూమి

కందికాయ పల్లె గ్రామం లో A/w భూమి :1600 ఎకరాలు అసైన్మెంట్ కమిటీ ద్వారా భూమి :100ఎకరాలు రిజిస్ట్రేషన్ భూమి 100 ఎకరాలు మొత్తం :1800ఎకరాలు భూమిని రైతుల నుండి సేకరణ, చేసారు, ఇందులో రైతులకు ఎకరాకు ప్రభుత్వ భూమి ఆరు లక్షలు రిజిస్ట్రేషన్ భూమికి 11 లక్షల విదంగా సమస్త చెల్లింపులు జరిపింది. అయితే నిజమైన రైతులకి పరిహారం అందడంలో అవకతవకలు జరిగాయి. కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆయన అనుచరులు ఇష్టారాజ్యంగా రైతులను భయపెట్టి అడ్డు అదుపు లేకుండా కోట్ల రూపాయల సొమ్మును కాజేశారని, దీనిపై సిబిసిఐడి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేయాలని వారు మంత్రిని దృష్టికి తీసుకువెళ్లారు.

**డిప్యూటీ తాసిల్దార్ మల్లికార్జున్ రెడ్డి అండతోనే భూముల కుంభకోణం జరిగింది**

పాణ్యం డిప్యూటీ తాసిల్దారుగా పనిచేసినటువంటి మల్లికార్జున్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కి అనుకూలంగా వ్యవహరించి రికార్డ్స్ ఆర్ ఓ ఆర్, ఆర్ఎస్ సార్, అన్లైన్ సైతం తరుమారు చేసి బినామీ పేర్ల మీద కూడా తప్పుడు రికార్డులు సృష్టించి గ్రీన్ కో సమస్య ద్వారా పరిహారంతీసుకున్నారు. భూములు కోల్పోయిన రైతులకి పూర్తిస్థాయి పరిహారం అందలేదు. అందుకోసమే తక్షణమే మల్లికార్జున్ రెడ్డిని విధుల నుంచి తొలగించి విచారణ ప్రారంభించాలని మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగానే సత్యప్రసాద్ గ్రీనుకో సంస్థ లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపులో అవినీతి కీ పాల్పడిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అక్రమాలపై ఆయనకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని దీనిపై జిల్లా కలెక్టర్ తో సమగ్ర విచారణ నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వారు తెలిపారు.